



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)





Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 192 | మంగళవారం 11 ఆగస్టు 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695










# ఏపీలో ఎన్నికల సందడి!

స్థానిక పోరుకు రంగం సిద్ధం

కోర్టు తీర్పులపై ఉత్కంఠ

13,341 పంచాయతీలపై ఫోకస్

87 సంస్థలకు ఎన్నికలు

వార్డుల పునర్విభజనపై దృష్టి

ఎన్నికలకు శాఖల సన్నాహాలు



2 లో

**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఎన్నికల సన్నద్ధతపై వేర్వేరుగా నివేదికలు సమర్పించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నివేదిక ప్రకారం.. డివిజన్లు, వార్డుల పునర్విభజనకు సంబంధించిన కేసుల్లో కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన 20 రోజుల్లో సుమారు 100 పురపాలికలు, నగర పంచాయతీల్లో అవసరమైన ప్రక్రియను పూర్తి చేయగలమని వెల్లడించింది. 2021లో ఎన్నికలు జరిగిన 100 పురపాలికలు, నగర పాలక సంస్థలు, నగర పంచాయతీల్లో 87 చోట్ల పాలకవర్గాల పదవీకాలం మార్చితో ముగిసింది. మరో 13 చోట్ల పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది నవంబర్ 22 వరకు కొనసాగనుంది. పదవీకాలం ముగిసిన 87 స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పురపాలక శాఖ ఎస్ఈసీకి తెలిపింది.

# లాఠీచార్జ్‌పై కాంగ్రెస్ పట్టు!

లాఠీచార్జ్‌పై ప్రకటనకు డిమాండ్

ప్రకటన వచ్చే వరకు డెడ్‌లాక్

పార్లమెంట్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభన

ప్రియాంక గాంధీ స్పష్టమైన హెచ్చరిక

కీలక బిల్లుల భవితవ్యంపై ఉత్కంఠ




# ఓటర్ల జాబితాలో భారీ కోత!

**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియతో 74లక్షల ఓట్లు తొలగనున్నాయి. ఇందులో ఔటర్ రింగ్ రోడ్ లోపలే దాదాపుగా 43 లక్షల ఓట్ల వరకు తొలగనున్నాయి. దాదాపుగా ప్రతి జిల్లాలో 50 వేల నుంచి లక్ష ఓట్ల వరకు తొలుగుతున్నాయి. ఇందులో ఎక్కువగా ఒకరికే రెండు ఓట్లు ఉండటం, ఆ తరువాత చనిపోయిన వారు, షిఫ్టింగ్ అయిన వారు ఎక్కువగా ఉన్నారని గుర్తించారు. ఆదివారం సాయంత్రం వరకు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించిన అధికారిక లెక్కలే వీటిని స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్రంలో ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు రెండు సార్లు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పెంచింది. ఈ నేపథ్యంలో రావాల్సిన ఫారాలు అత్యధికం వచ్చాయని, ఈ రెండు రోజుల్లో తక్కువగానే వస్తాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. జూన్ 25న ప్రారంభమైన ప్రక్రియ 45రోజుల గడువును కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 74లక్షల ఓట్లు తొలగించడం ఖాయమైంది. సోమవారంతో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ముగిసింది. ఈనెల 17న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

మిగతాది 2 లో..

- 74 లక్షల ఓట్లకు కోత!
- హైదరాబాద్‌లో భారీ షాక్
- మూడు జిల్లాల్లోనే 43 లక్షలు
- డూప్లికేట్ ఓట్ల ఏరివేత
- ముసాయిదాతో కొత్త రగడ
- బీఎల్‌వోలపై తీవ్ర ఆరోపణలు
- తుది జాబితాపై ఉత్కంఠ
- కొత్త పోలింగ్ బూత్‌లు

# ట్రిబ్యునల్స్‌పై కేంద్రం కీలక నిర్ణయం!

లోక్‌సభలో బిల్లుకు ఆమోదం

మూజువాణి ఓటుతో బిల్లు పాస్

విపక్షాల నిరసనల మధ్యే ఆమోదం

ట్రిబ్యునళ్లలో నిబంధనలకు ఏకరూపత

అనవసర ట్రిబ్యునళ్లకు ఇక చెక్

త్వరిత న్యాయానికి కొత్త మార్గం



2 లో

**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** పార్లమెంట్‌లో ప్రతిపక్షాల తీవ్ర నిరసనలు, హోరెత్తించే నినాదాల మధ్యే లోక్‌సభ అత్యంత కీలకమైన 'ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు-2026' కు ఆమోదం తెలిపింది. విపక్షాలు లేవనెత్తిన ఆందోళనల దృష్ట్యా ఎలాంటి ముందస్తు చర్చ లేదా ఓటింగ్ లేకుండా, మూజువాణి ఓటు ద్వారానే సభ ఈ బిల్లును క్లియర్ చేసింది.

# డీఎస్సీ రగడ.. బాబు ఫైర్!

వైసీపీ ఆందోళనలకు కౌంటర్


రోడ్లపై రచ్చ సహించను

ప్రజలకు ఇబ్బందులు వద్దు

రౌడీలకు సింహ స్వప్నం

డీఎస్సీపై కీలక వ్యాఖ్యలు


అభివృద్ధిపై క్రెడిట్ వార్



**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** డీఎస్సీ విషయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఏలూరు జిల్లా పర్యటనలో కైకలూరు, కలిదిండి సభలో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. అయితే ఉద్యోగాలు ఇవ్వకుండా కొందరు కోర్టులను ఆశ్రయించారని, అనంతరం కోర్టులో ఉన్న అంశాలను పరిష్కరించి ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది తర్వాత వైసీపీ రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తోందని చంద్రబాబు విమర్శించారు. ఢిల్లీలో నీట్ లీక్ జరిగితే ఇక్కడ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం డీఎస్సీ అభ్యర్థుల పేరుతో అనవసర ఆందోళనలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

2 లో

# పెద్ది విగ్రహంపై రగడ!



2 లో

పెద్ది విగ్రహాన్ని ఆవిష్కరించిన బీఆర్ఎస్ శ్రేణులు

పోలీసులు, కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం

మాజీ మంత్రుల ఆధ్వర్యంలో భారీ ధర్నా

మెడికల్ కాలేజీ వద్ద భారీగా పోలీసుల మోహరింపు

అనుమతులపై కొనసాగుతున్న సందిగ్ధత

# పాలమూరుకు కేంద్రం షాక్!



2 లో

జాతీయ హోదాపై కేంద్రం క్లారిటీ

ప్రతిపాదన లేదన్న కేంద్ర ప్రభుత్వం

డీపీఆర్‌ను వెనక్కి పంపిన కేంద్రం

కృష్ణా జలాలపై స్పష్టత కరవు

ఆర్థిక సాయంపైనా తుది నిర్ణయం లేదు

# యుద్ధానికి ట్రంప్ ఎండ్ కార్డ్!



**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** నెలల తరబడి కొనసాగుతున్న ఇరాన్, అమెరికా యుద్ధం ప్రపంచ దేశాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ముఖ్యంగా ఈ యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు అందరిని టెన్షన్ పెట్టిస్తున్న వేళ ట్రంప్ సంచలన నిర్ణయం దిశగా అడుగులు వేయబోతున్నట్లు అంతర్జాతీయ వార్త సంస్థ ది వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఇరాన్‌తో పూర్తిస్థాయి కొత్త అణు ఒప్పందం కుదరకపోయినా యుద్ధం ముగించేందుకు సిద్ధం అవుతున్నారని ఇందుకోసం హోర్ముజ్ జలసంధిని పూర్తిగా పునఃప్రారంభిస్తే చాలు అనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి ద్వారా అంతర్జాతీయ నౌకాయానం పునరుద్ధరణే ప్రాతిపదికగా సైనిక దాడిని నిలిపివేసి, కాల్పుల విరమణను పొడిగించేందుకు ట్రంప్ సుముఖంగా ఉన్నట్లు అమెరికా అధికారులు వెల్లడించినట్లు ఈ కథనం పేర్కొంది.

మధ్యంతర ఎన్నికల కోసమే..

అయితే అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ రాజకీయంగా నష్టం జరగకుండా ట్రంప్ ఈ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతకాలం ఇరాన్ పై చేసి యుద్ధం ద్వారా ఏం సాధించామో ఓటర్లకు ట్రంప్ చెప్పుకోవాల్సిన పరిస్థితి ఉంది. ట్రంప్ తీరుపై ఇప్పటికే అమెరికన్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోందనే వార్తలు సైతం వచ్చాయి. ఎలాంటి సంబంధం లేకపోయినా ఇరాన్ తో యుద్ధానికి దిగి దేశ సైనిక సంపదను నాశనం పట్టిస్తున్నారని ట్రంప్ పై అమెరికట్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీనికి తోడు ఫిబ్రవరిలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసి, క్షిపణి, డ్రోన్ దాడులతో నౌకల రాకపోకలను అడ్డుకుంటోంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు విఘాతం కలగడమే కాకుండా అమెరికాలో పెట్రోల్ ధరలు పెరిగాయి. వీటన్నిటికి చెక్ పెట్టాలంటే ఇరాన్ యుద్ధాన్ని విరమించాలనే ఆలోచనకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

ఇరాన్ కఠిన నిబంధనలు..

ట్రంప్ ఆలోచన ఇలా ఉంటే జలసంధిని తెరవడానికి ఇరాన్ కీలక డిమాండ్లు అమెరికా ముందు ఉంచుతున్నది. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించి నౌకా దిగ్బంధం ఎత్తివేయాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అమెరికా సైన్యాన్ని గల్ఫ్ నుంచి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోంది.

# ట్రిబ్యునల్స్‌పై కేంద్రం కీలక నిర్ణయం!

మొదటి పేజీ తరువాయి

బిల్లు ఆమోదం పొందిన వెంటనే, ప్రతిపక్షాల నిరసనలు మిన్నంటడంతో లోక్‌సభను స్పీకర్ రేపటికి వాయిదా వేశారు.

న్యాయ వ్యవస్థను మరింత పటిష్టం చేయడం, కేసుల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించడం, వివిధ రకాల ట్రిబ్యునళ్ల నిర్వహణను క్రమబద్ధీకరించడం ఈ బిల్లు యొక్క ప్రధాన లక్ష్యం. దేశంలోని వేర్వేరు ట్రిబ్యునళ్ల అధ్యక్షులు, సభ్యుల అర్హతలు, నియామక ప్రక్రియలు, పదవీ కాలం, సేవా నిబంధనలలో స్పష్టమైన ఏకరూపతను తీసుకురావడానికి ఇది దోహదపడుతుంది. దీనివల్ల ప్రతి ట్రిబ్యునల్‌లో ఒకే రకమైన నిబంధనలు అమలులోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా అప్పీలేట్ ట్రిబ్యునళ్ల పనితీరును సమీక్షించి, సరిగా పనిచేయని లేదా అనవసరమైన ట్రిబ్యునళ్లను రద్దు చేసి వాటి బాధ్యతలను నేరుగా హైకోర్టులకు లేదా పౌర న్యాయస్థానాలకు బదిలీ చేస్తారు.

ఇది అనవసరపు పరిపాలనా ఖర్చులను తగ్గించి ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా, నియామకాల పరిశీలన మరియు ట్రిబ్యునళ్ల స్వతంత్రతను కాపాడటానికి ఒక కేంద్రీకృత వ్యవస్థగా 'నేషనల్ ట్రిబ్యునల్స్ కమిషన్' ఏర్పాటుకు బాటలు వేస్తుంది. ఫలితంగా న్యాయ సేవలలో పారదర్శకత పెరిగి, ప్రజలకు త్వరితగతిన న్యాయం లభిస్తుంది.

# పాలమూరుకు కేంద్రం షాక్!

**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా కల్పించడంపై కేంద్ర కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రజలు ఎంతో ఎదురు చూస్తున్న ఈ ప్రాజెక్టు పై కేంద్రం స్పందిస్తూ.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చే ప్రతిపాదన ఏది ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రకటన చేసింది. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర వివాదాల అంశాలు ప్రస్తుతం ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నందున ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'టెక్నో ఎకనామిక్ అప్రైజల్' (సాంకేతిక-ఆర్థిక అధ్యయనం) ప్రక్రియను ప్రస్తుతం చేపట్టలేమని కేంద్రం స్పష్టం చేసింది. అంతేకాకుండా, తెలంగాణ ప్రభుత్వం మరింత సమగ్రమైన ప్రణాళికతో రావలసి ఉందంటూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సమగ్ర నివేదికను కేంద్రం తిరిగి వెనక్కి పంపించింది.

కృష్ణా నీటి కేటాయింపులపై స్పష్టత వచ్చే వరకు ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అందించే ఆర్థిక సహాయం విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) నిబంధనలకు అనుగుణంగా అన్ని రకాల అనుమతులు, క్లియరెన్స్ సాధించిన తర్వాతే జాతీయ హోదా ప్రాజెక్టుల పురోగతి సాధికార కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదాపై కేంద్రం చేసిన ఈ సంచలన ప్రకటనతో తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఏపీలో ఎన్నికల సందడి!

మొదటి పేజీ తరువాయి



ఇదిలా ఉండగా.. సమీప గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో విలీనం చేసేందుకు తీసుకొచ్చిన చట్టం-5ను సవాల్ చేస్తూ హైకోర్టులో 35 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. కోర్టు ఆదేశాల నేపథ్యంలో 2021లో 23 పురపాలికలు, నగర పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థతో పాటు శ్రీకాళహస్తి, కావలి, ఆలూరు పురపాలికలు, నగర పంచాయతీలకు సంబంధించిన కొన్ని రిట్ పిటిషన్లు ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన కేసులను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పురపాలక శాఖ వెల్లడించింది.

మరోవైపు రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ కూడా సన్నద్ధత వ్యక్తం చేసింది. 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించింది. వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాలను ప్రచురించి ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నట్లు తెలిపింది. అయితే కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల సుమారు 100 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోవచ్చని పంచాయతీరాజ్ శాఖ పేర్కొంది. 2021 ఎన్నికల సమయంలో హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా 354 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సుమారు 13,100 పంచాయతీలకే ఎన్నికలు జరిగాయి. మొత్తంగా పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన వివాదాలు పరిష్కారమై, వార్డులు, డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పూర్తయితే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం, సంబంధిత శాఖలు సిద్ధంగా ఉన్నట్లు ఎస్ఈసీకి స్పష్టత ఇచ్చాయి. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై మరోసారి కదలిక మొదలైనట్లు తెలుస్తోంది.

# డీఎస్సీ రగడ.. బాబు ఫైర్!

మొదటి పేజీ తరువాయి



రోడ్లపై స్వైరవిహారం చేస్తే సహించను

అనవసర ఆందోళనలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడాన్ని ప్రభుత్వం సహించదని చంద్రబాబు స్పష్టం చేశారు. రోడ్లన్నీ కొందరు స్వైరవిహారం చేయడానికి, ఇష్టానుసారంగా వ్యవహరించడానికి ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తాను మౌనంగా ఉంటే ఎవరినీ నిద్రపోనివ్వరని, రోజూ రౌడీయిజం చేసే పరిస్థితులు వస్తాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులపై క్రెడిట్ వ్యాఖ్యలు

భోగాపురం విమానాశ్రయం విషయంలోనూ రాజకీయంగా క్రెడిట్ తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. భోగాపురం తానే నిర్మించానని కొందరు చెప్పుకుంటున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కూడా దానిని తానే పూర్తి చేశానని చెప్పుకునే పరిస్థితి వస్తుందని, రేపు అమరావతి పూర్తయితే అది కూడా తానే నిర్మించానని చెప్పుకునే అవకాశం ఉందని విమర్శించారు.

రౌడీయిజం చేయను.. రౌడీలకు సింహ స్వప్నంగా ఉంటా

తాను రౌడీయిజం చేయనని చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే రౌడీలకు మాత్రం సింహ స్వప్నంగా ఉంటానని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అడ్డుకోవడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు ఏపీ సీఎం చంద్రబాబు.. కాగా, డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోన్న విషయం విదితమే..

# తమిళ తాయ్ వాజ్తుకు గౌరవం



**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** తమిళనాడు అస్తిత్వం విషయంలో ఆ రాష్ట్ర శాసనసభ వేదికగా రాజకీయ పక్షాలన్నీ మరోసారి ఏకతాటిపైకి వచ్చాయి. ఇకపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యాసంస్థల్లో రాష్ట్ర గీతం 'తమిళ తాయ్ వాజ్తు' ను అన్నింటికంటే ముందు ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ సోమవారం సీఎం విజయ్ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు అక్కటి కావడంతో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ తమిళభాష ప్రాచీనత, తమిళ నాగరికతను కాపడటమే తమ లక్ష్యం అని చెప్పారు.

ఇటీవలే వివాదం:

కాగా, గత నెలలో రాష్ట్రంలోని మనోన్మానియం సుందరనార విశ్వవిద్యాలయం 33 వ స్నాతకోత్సవాన్ని రాష్ట్ర గీతం తమిళ్ తాయ్ వాజ్తుకు బదులుగా జాతీయ గీతం 'వందేమాతరం'తో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీతాన్ని మూడవ స్థానంలో ఆలపించడం రాజకీయంగా వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో తమిళ్ తాయ్ వాజ్తును ప్రారంభంలోనే ఆలపించే సాంప్రదాయాన్ని కొనసాగించాలని కోరుతూ తమిళనాడుకు చెందిన 21 మంది పార్లమెంట్ సభ్యులు ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి (ఆర్లేకర్) కు ఉమ్మడిగా ఒక లేఖ రాశారు. ఈ క్రమంలో తాజాగా అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెట్టగా అన్ని పార్టీలో ఒకే అభిప్రాయం వ్యక్తం చేశాయి. దీంతో ఇకపై తమిళనాడులో అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యక్రమాలు తమిళనాడు రాష్ట్ర గేయంతోనే ప్రారంభం కానున్నాయి.

# ఓటర్ల జాబితాలో భారీ కోత!

మొదటి పేజీ తరువాయి




ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వచ్చే నెల 17 నుంచి అక్టోబరు 15 వరకు నోటీసులు ఇవ్వడం, అభ్యంతరాలను పరిష్కరించడం చేస్తారు. అక్టోబరు 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448ఓటర్లు ఉండగా, ఇందులో ఇప్పటి వరకు 2,64,30,494 ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించారు. 2.80 లక్షలు షిఫ్టింగ్, చనిపోయిన వారు, స్థానికంగా లేని వారిని, ఒకరికి రెండు చోట్ల ఉన్న వారు 3.13లక్షల ఓటర్లుగా గుర్తించారు. మరొక 73,95,954 మంది ఓటర్లు ఇంత వరకూ ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వలేదని తేల్చారు. దింతో మొత్తం 74 లక్షల వరకు ఓటర్లు ఓటరు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 19.61లక్షలు, మేడ్చల్ జిల్లాలో 10.77లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 12.98లక్షల ఓట్లు తొలగనున్నాయి. సంగారెడ్డి, వికారాబాద్, కరీంనగర్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో రెండు లక్షలకు పైగా ఓట్లు తొలగించనున్నారు. ఒక వేళ కొందరు ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలు వచ్చినా కనీసం 70 లక్షల వరకు ఓట్లు తొలగించాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వివిధ ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి, ఉద్యోగ, విద్య, వ్యాపార అవకాశాలకు ఇక్కడికి వచ్చిన వారు తమ సొంత ప్రాంతంలోనే ఓటు హక్కును కొనసాగించడానికి మొగ్గు చూపారని ఎన్నికల సంఘం లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

ముసాయిదా తరువాత..

రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. బీఎల్‌వోలకు సరైన అవగాహన లేకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల సంఘం సూచనలకు కనీస అవగాహన లేకపోవడం, కనీస విద్యార్హతలేని వారిని బీఎల్‌వోలుగా నియమించడంతో ఎస్ఐఆర్ పక్రియపై తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 74 లక్షలకు పైగా ఓటర్లను తొలగించే అవకాశాలు ఉండటంతో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ తరువాత తీవ్ర విమర్శలు, ఆరోపణలు వ్యక్తమయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. తెలంగాణ కంటే జనాభా పరంగా పెద్ద రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 40 లక్షల ఓట్లు మాత్రమే తొలగించగా ఇక్కడ మాత్రం ఏకంగా 74లక్షల ఓట్లు పోతే రాజకీయంగా తీవ్ర విమర్శలను ఎదుర్కొనే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

కొత్తగా పోలింగ్‌స్టేషన్లు..

ఈ నెల 10న తాజా ఓటర్ల జాబితాకు అనుగుణంగా కొత్త పోలింగ్‌స్టేషన్ల జాబితాను ప్రచురిస్తారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో గరిష్ఠంగా 1200 మంది ఓటర్లు ఉండే విధంగా పోలింగ్ స్టేషన్‌ను రూపొందించాలని కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో ఒక్కో దాంట్లో 1500 వరకు ఓటర్లు ఉండేవారు. అయితే ఓటర్లు ఓటు వేయడానికి ఉదయం వేళల్లో ఎక్కువ సంఖ్యలో రావడంతో క్యూ లైన్ భారీగా ఉండటంతో ఓటర్లు కొంత అసహానానికి గురవుతున్నారని, ఎక్కువ సమయం పడుతుందనే ఉద్దేశంతో తక్కువ సంఖ్యలో ఓటర్లతో ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

# లాఠీచార్జ్‌పై కాంగ్రెస్ పట్టు!



**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** మెంట్‌లో ప్రకటన చేసే వరకు ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న స్తంభన (డెడ్‌లాక్) విడదని కాంగ్రెస్ నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. వర్షాకాల సమావేశాలు ముగియడానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో, తీవ్ర నిరసనల నడుమ మహిళా సంరక్షణ (మహిళా రిజర్వేషన్), నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), విదేశీ నిధుల క్రమబద్ధీకరణ సవరణ చట్టం వంటి కీలక బిల్లుల భవితవ్యం అనిశ్చితిలో పడింది. సోమవారం లోక్‌సభ అజెండా జాబితాలో కూడా ఈ బిల్లులు చోటుచేసుకోలేదు. పార్లమెంట్ ప్రాంగణంలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ మంత్రి స్వయంగా ప్రకటన చేస్తేనే సభ సజావుగా సాగుతుందని తేల్చి చెప్పారు.

ప్రభుత్వం జరిపిన చర్చల అనంతరం మహిళా కోటా, డీలిమిటేషన్ బిల్లులపై కొన్ని ప్రతిపక్షాలు కొంత మెత్తబడినప్పటికీ, కాంగ్రెస్తో పాటు దాని భాగస్వామ్య పక్షాలు మాత్రం ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుతో సహా ఇతర బిల్లులను గట్టిగా అడ్డుకోవాలని నిర్ణయించాయి. ఎన్‌జీఓలు, మైనారిటీ సంస్థలను లక్ష్యంగా చేసుకుని తెస్తున్న ఎఫ్‌సిఆర్ఎ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ప్రజా వ్యతిరేకమని ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. ఒకవేళ కేంద్రం బలవంతంగా ఈ బిల్లును ఆమోదింపజేయాలని చూస్తే పార్లమెంట్‌లో తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విదేశీ నిధులు పొందే సంస్థలపై కఠిన ఆంక్షలు విధించేలా రూపుదిద్దుకున్న ఈ బిల్లును పలు క్రైస్తవ సంస్థలు, రాజకీయ పక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జూలై 20న ప్రారంభమైన ఈ వర్షాకాల సమావేశాలు ప్రతిపక్షాల వరుస నిరసనలు, వాయిదాల నడుమ దాదాపు ఏమాత్రం సాగలేదు. కేవలం పోటీ పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు-2026తో పాటు, కొన్ని చిన్న బిల్లులు మాత్రమే చర్చ లేకుండా ఆమోదం పొందాయి.

# చిన్నారులకు నిమ్స్ వరం!




**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారులకు పూర్తిగా ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవరాజ్ తెలిపారు. నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ ప్రొ. అమరేశ్వర్ నేతృత్వంలో ఈ ఏడాది ఆగస్టు 13 నుంచి ఈ శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. లండన్‌కు చెందిన వైద్యులు, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డా.రమణ తన్నషనేని, సాంకేతిక నిపుణుల బృందం సహకారంతో ఈ ప్రత్యేక శస్త్రచికిత్సలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత ఐదేళ్లుగా ప్రతి సంవత్సరం నిమ్స్‌లో ఈ ఉచిత గుండె శస్త్రచికిత్స కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

వాక్ ఇన్ విధానంలో చిన్నారుల పరిశీలన:

అవసరాన్ని బట్టి ప్రాధాన్యత కేటాయిస్తూ వాక్-ఇన్ విధానంలో చిన్నారులను పరిశీలిస్తామని దేవరాజు తెలిపారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం శస్త్రచికిత్స అవసరమున్న చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఇందుకోసం సోమవారం నుంచి శనివారం వరకు, ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు సీటీ సర్జరీ కార్యాలయం, మొదటి అంతస్తు, పాత బ్లాక్, నిమ్స్, పంజాగుట్ట, హైదరాబాద్ లో సంప్రదించాలని సూచించారు. అలాగే ఫోన్ 040-2348-9025 ద్వారా సంప్రదించాలన్నారు. అందుబాటులో ఉంటే పాత వైద్య రిపోర్టులు తమ వెంట తీసుకురావాలని సూచించారు.

# జార్ఖండ్‌లో జేపీఎస్సీ సెగ!




**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉద్యోగ నియామక పరీక్షల్లో భారీగా అక్రమాలు, తీవ్ర అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో వేలాది మంది విద్యార్థులు, అభ్యర్థులు నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే. గత రెండు వారాలకు పైగా జరుగుతున్న ఈ నిరసనలు సోమవారం తీవ్ర రూపం దాల్చింది. దీంతో పోలీసులు విద్యార్థులు, జేపీఎస్సీ అభ్యర్థులపై లాఠీలను, వాటర్ గన్, టియర్ గన్ లను ఉపయోగించారు. ఇదిలా ఉండగా.. ఈ వ్యవహారంలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న జార్ఖండ్ సీఐడీ అధికారులు జేపీఎస్సీ మాజీ చైర్మన్ ఎల్ ఖియాంగ్తే ను సోమవారం అరెస్టు చేశారు. ఈ విషయాన్ని జార్ఖండ్ సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ మనోజ్ కౌశిక్ అధికారికంగా ధృవీకరించారు. నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణలో భాగంగా ఈ అరెస్ట్ నమోదు చేసినట్లు వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ పొందిన అనంతరం ఎల్ ఖియాంగ్తే గత ఏడాది ఫిబ్రవరిలో జేపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే, సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ తో పాటు పలు ఉద్యోగ ప్రకటనల నిర్వహణలో అక్రమాలు జరిగాయని అభ్యర్థులు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర స్థాయిలో నిరసనలు వెల్లువెత్తాయి. కేసు తీవ్రత దృష్ట్యా, విచారణ నిష్పక్షపాతంగా జరిగేందుకు వీలుగా ఆయన జులై 22న తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఈ వ్యవహారంలో సీఐడీ ఇప్పటికే పలు చోట్ల సోదాలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకోగా, మాజీ చైర్మన్‌ను అరెస్టు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో, నిరుద్యోగ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# పెద్ది విగ్రహంపై రగడ!



**న్యూస్ డెస్క్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన గద్దెను మున్సిపల్ అధికారులు గత రాత్రి కూల్చివేశారు. దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. పెద్ది సంస్మరణ సభ అనంతరం మెడికల్ కాలేజీ పరిసరాలకు చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు.. కూల్చివేసిన ప్రదేశంలోనే మళ్లీ గద్దె నిర్మించి, పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని డీసీపీ అంకిత్‌కుమార్, ఏసీపీ రవీందర్‌రెడ్డి సమీక్షిస్తున్నారు. భారీగా పోలీసులు మోహరించారు. మరోవైపు మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూడా అక్కడికి చేరుకున్నారు. విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయా? లేదా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం మెడికల్ కాలేజీ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

కెరటం న్యూస్

మంగళవారం 11 ఆగస్టు 2026

# జైల్ బరో కు డివైఎఫ్ఐ మద్దతు



**కారేపల్లి, కెరటం న్యూస్:** కారేపల్లి లో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా తెలియజేస్తున్న జైలు బరో కార్యక్రమానికి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ పెట్టుబడిదారులకు మద్దతు తెలియజేస్తూ కార్మిక చట్టాలను ఎత్తివేసి నాలుగు లేబర్ కోడ్ బిల్లులు తేవడం శ్రమను దోపిడీ చేయడమేనని, ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి జిరాంజీ బిల్లు గా మార్చడం కూలీలను మోసం చేయడం అని, రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ కనీస మద్దతు ధర చట్టం చేయకపోవడం దుర్మార్గమని పేదలకు ఉచితంగా అందుతున్న విద్యుత్తును దూరం చేయడం ప్రజలపై భారాలు మోపే విద్యుత్ సవరణ చట్టం తీసుకొచ్చి రైతులను మోసం చేస్తున్నదని అదేవిధంగా యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగిత రేటును పెంచుతున్నదని ఈ కారణంగా పెట్టుబడిదారులకు కార్మిక శ్రమ చౌకగా జరగడానికి తోడ్పడుతున్నదని వీటికి వ్యతిరేకంగా యువకులు ఉద్యమించాలని ఆదేర్ల వినయ్ కుమార్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గాదె నరేష్, చిలుముల భరత్, కాకాటి పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ టీచర్ ఇందిరకు అభినందన సత్కారం



**తిరుమలాయపాలెం, కెరటం న్యూస్:** తిరుమలాయపాలెం మండలం గోపాలపురం గ్రామంలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచిన నిమ్మ తోట ఇందరకు బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నేతలు శాలువాతో సత్కరించి అభినందన జ్ఞాపికను అందజేశారు ఈ సందర్భంగా సీనియర్ దళిత నాయకులు గుంతేటి వీరభద్రం హైకోర్టు న్యాయవాది పల్లా రాజశేఖర్ లింగాల రవికుమార్ పలువురు నాయకులు మాట్లాడుతూ గోపాలపురం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండగా విద్యార్థుల విద్యా బోధన అసౌకర్యంగా ఉండటంతో అక్కడే ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న నిమ్మ తోట ఇందిర తన సొంత ఖర్చులతో రేకుల షెడ్డు నిర్మించి విద్యార్థులకు విద్యాబోధన చేయడాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి టీచర్ ఇందిర కు ఫోన్ చేసి అభినందించి పాఠశాల భవనానికి తక్షణమే 30 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాలని ఆదేశించడం అభినందనీయమని ఉపాధ్యాయురాలు ఇందిర చూపిన చొరవ ఇతరులకు స్ఫూర్తిదాయకమని అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ మోటపోతుల బాబురావు వివిధ సంఘాల నేతలు ముడుసు జాకబ్ ప్రతాప్ దాసరి దానియేలు జంగం లక్ష్మణరావు దామల్ల సత్యం బిందె రమేష్ కరాటే వేణు దారా సందీప్ జ్యోతి మోహన్ రావు స్వరూప రాణి తదితరులు నిమ్మ తోట ఇందిర ను అభినందించారు.


# పెద్ది యాదిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య..



**వరంగల్ బ్యూరో, కెరటం న్యూస్:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలు వేసి అంజలి ఘటించారు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో జరిగిన పెద్ది సంస్మరణ సభ కు సండ్ర హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకరరావు లతో కలిసి సంస్మరణ సభ పాల్గొన్నారు. వేదిక మీద పెద్ది సుదర్శన్ రెడ్డికి అంజలి ఘటించారు. ఆయన నివాసానికి వెళ్లి నర్సంపేట నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్దితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని, నర్సంపేట ప్రజల గుండెల్లో పెద్ది చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. సండ్ర వెంకటవీరయ్య వెంట ఖమ్మం రూరల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు ఉన్నారు.

# మద్యం మత్తులో బాలికకు వైద్యం?

## వైద్యం వికటించి 8వ తరగతి విద్యార్థిని మృతి



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఓ గ్రామీణ వైద్యుడు మద్యం సేవించి బాలికకు వైద్యంచెయ్యడంతోబాలిక మృతిచెందినట్టుఆరోపణలువస్తున్నాయి. కుటుంబ సభ్యుల ఆరోపణ ప్రకారం సదరు వైద్యుడు పరారీలో ఉన్నట్టు తెలుస్తోంది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో విషాద ఘటన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జలుబు, జ్వరంతో అస్వస్థతకు గురికావటంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్దకు తీసుకు వెళ్లిన తల్లిదండ్రులు...ఆర్ఎంపీ చేతికి ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం బాలికకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడడంతో.. వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులుఅక్కడ వైద్యులు ఈసీజీ నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధారణ చేసినట్టు తెలుస్తోంది.ఆర్ఎంపీ వైద్యుడిపై పోలీస్ స్టేషన్లో బాలిక తండ్రి ఫిర్యాదు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు. ఆర్ఎంపీ వైద్యుడు పరారిలో ఉన్నట్టు తెలుస్తోంది.

# బూత్ ఏజెంట్లకు డీసీసీ చీఫ్ నూతి అభినందనలు



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** మండల, పట్టణ అధ్యక్షులకు, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లకు బూత్ లెవెల్ ఏజెంట్లకు, ముఖ్య నాయకులకు అభినందనలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు సంబంధిత శాసనసభ సభ్యుల ఆమోదంతో నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ తేదీ 24-06-2026 మొదలైన నాటి నుండి సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేశారని జిల్లాలో మొత్తం1460 బూత్ లకు ఈనాటికి 1276 బూత్ లలో 95 నుండి 100 శాతం, 172 బూత్ లలో 90 నుండి 95 శాతం, 12 బూత్ లలో 80 నుండి 90 శాతం నమోదు పూర్తి అయిందని క్షేత్ర స్థాయిలో పనిచేసిన మండల, పట్టణ అద్యక్షులకు, బూత్ లెవెల్ ఏజెంట్లకు, బూత్ లెవెల్ సూపర్ వైజర్ లకు, ముఖ్య నాయకులకు అధికారులతో సమన్వయంతో

పనిచేసిన శ్రేణులు అందరికి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. అదే విధంగా జిల్లా కాంగ్రెస్ పార్టీకి నిరంతర సహాయసహకారాలు అందించారని, రాబోవు రోజులలో వారి సహాయ సహకారాలు అందించాలని కోరుతూ మధిర నియోజకవర్గ శాసనసభ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, పాలేరు నియోజకవర్గ శాసనసభ సభ్యులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం నియోజకవర్గ శాసనసభ సభ్యులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ సభ్యులు మట్టా రాగమయిదయానంద్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతాభినందనలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

# కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసిన తెలంగాణ బీజేపీ బృందం



**వర్ధన్నపేట, 10 ఆగష్టు (కెరటం న్యూస్):** వరంగల్-మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ బీజేపీ ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణలతో కలిసి ఢిల్లీలో మంత్రిని కలసి అధికారిక లేఖ అందజేశారు. మామునూరు విమానాశ్రయ శంకుస్థాపన/ప్రారంభోత్సవానికి వరంగల్ రావాలని మంత్రిని ఆహ్వానించారు.

విమానాశ్రయం కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కొండేటి శ్రీధర్ కోరారు. అదిలాబాద్ ఎయిర్పోర్టు నిర్మాణాన్ని కూడా త్వరగా చేపట్టాలని ఎంపీ గోడెం నగేష్ విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థనలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం బీజేపీ బృందం మంత్రిని సత్కరించింది.

# గోవా గవర్నర్ ను కలిసిన డా. కడవెండి వేణుగోపాల్

## ప్లాస్టిక్ రహిత భారత్, పర్యావరణ పరిరక్షణపై చర్చ



**వనం నాగయ్య, కెరటం న్యూస్:** ఎకో-క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డా. కడవెండి వేణుగోపాల్, తన సతీమణి అరుణ కడవెండితో కలిసి, గోవా గవర్నర్ పుసపాటి అశోక్ గజపతి రాజును మధ్యాహ్నం 12:00 గంటలకు లోక్ భవన్ (రాజ్ భవన్), గోవాలో కలిశారు. దాదాపు ఒక గంట పాటు జరిగిన ఈ సమావేశంలో, డా. కడవెండి వేణుగోపాల్ వివిధ పర్యావరణ సమస్యలపై చర్చించి, పర్యావరణ పరిరక్షణను మరింత బలోపేతం చేయడం, ప్లాస్టిక్ రహిత భారత్ సాధనను ప్రోత్సహించడంపై తన దృష్టికోణాన్ని గవర్నర్కు వివరించారు. ఎకో-క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. ప్రజల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు ప్రచారాలు, పర్యావరణ విద్య, విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు, వాతావరణ మార్పులపై అవగాహన, సింగిల్-యూజ్ ప్లాస్టిక్కు బదులుగా పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాల వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను వివరించారు. అలాగే, పర్యావరణ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం నుంచి మద్దతు, ప్రోత్సాహం కల్పించాలని కోరుతూ డా. కడవెండి వేణుగోపాల్ గవర్నర్కు పత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో ముఖ్యమైన ఘట్టంగా, గవర్నర్ పుసపాటి అశోక్ గజపతి రాజు "ప్లాస్టిక్ రహిత భారత్" బ్యానర్ను ఆవిష్కరించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు సమిష్టి చర్యలు అవసరమని, భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందనే సందేశాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. ఈ సందర్భంగా డా. కడవెండి వేణుగోపాల్ మరియు అరుణ కడవెండి గవర్నర్ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. పర్యావరణ బాధ్యత, సుస్థిర అభివృద్ధి, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై జరిగిన ఈ సమావేశం ఫలవంతంగా మరియు ప్రోత్సాహకరంగా సాగింది. ప్లాస్టిక్ రహిత భారత్ కార్యక్రమానికి గవర్నర్ అందించిన ప్రోత్సాహానికి డా. కడవెండి వేణుగోపాల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మోడీ తీరు మారకుంటే పతనమే



### -కార్పొరేట్, సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్
### -అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు
### -ఖమ్మంలో విజయవంతమైన జైల్ భరో
### -వందలాది మంది అరెస్టు

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** మోడీ తీరు మారకుంటే పతనం తప్పదని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కార్మిక హక్కులను హరించి వేస్తూ లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకు వచ్చారని వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టి రైతును భూమి నుంచి తరిమేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదని నేతలు -తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఖమ్మంలో సోమవారం జైల్భరో కార్యక్రమాన్ని -నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది -మంది రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. పోలీసులు అఖిలపక్ష నేతలను -అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వందల సంఖ్యలో ఆందోళనకారులు తమను కూడా అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్లో చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ఆందోళనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, బానోత్ చంద్రావతి, సివై పుల్లయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వి. కోటేశ్వరరావు, -వై. ప్రకాష్, బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి. రామయ్య, యర్రా శ్రీనివాస్, మెరుగు -సత్యనారాయణ, అశోక్, నరాల నరేష్ నాయుడు, ఎండివై పాషా తదితరులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ సర్కార్ సంపన్నుల సేవలోనే ఉందని రైతులు, కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు. దేశ సంపదను అంబానీ, -అదానీలతో పాటు కార్పొరేట్లకు కట్టబెడుతూ వ్యవసాయ రంగాన్ని కూడా వారి పరం చేసేందుకే నూతన సాగు చట్టాలను తీసుకు -వచ్చిందని ఆయన తెలిపారు. చారిత్రిక పోరాట నేపథ్యంలో సాగు చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన దొడ్డి దారిని వాటిని అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు. పంటకు మద్దతు ధరను ప్రకటించడంతో పాటు వాటి అమలుకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు రావాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు వచ్చేంత -వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనను నిర్వహించి ఈ ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. వ్యవసాయాన్ని -లాభసాటిగా చేయడమంటే కార్పొరేట్లకు కట్టబెట్టడమేనా అని ఆయన ప్రశ్నించారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందని ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదన్నారు. యాజమాన్యాల చేతుల్లో కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నారని దీనిని యావత్ కార్మిక లోకం నిరసిస్తుందన్నారు. 12 ఏళ్ల కాలంలో మోడీ ఏ ప్రజా అనుకూల నిర్ణయాన్ని చేయలేదని ప్రజలను వంచించే ప్రయత్నంలోనే దశాబ్ద కాలం గడిపారని హేమంతరావు తెలిపారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆయన తెలిపారు. సంఘటిత పోరాటాలే మోడీ ప్రభుత్వాన్ని నిలువరిస్తాయన్నారు. రాముడి పేరుతో ఎంతో కాలం ప్రజలను వంచించలేరని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిడికంటి వెంకటరెడ్డి, శంకరయ్య, సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, బండి పద్మ, వై. విక్రం, నవీన్రెడ్డి, శోభ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.



కెరటం న్యూస్



# కారేపల్లిలో కదం తొక్కిన కార్మికులు

## నేతల అరెస్టుల తో ఉద్రిక్తత కారేపల్లిలో జైల్ భరో విజయవంతం




**కారేపల్లి, కెరటం న్యూస్ ప్రతినిధి:** కేంద్రప్రభుత్వ కార్మిక, కర్షక రైతు విధానాలపై నిరసిస్తూ సోమవారం దేశవ్యాప్తంగానిర్వహించిన జైలు భరో కార్యక్రమం కారేపల్లిలో విజయవంతమైంది. సీపీఐ(ఎం) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు కారేపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ లో రాస్తారోకో, మానహారం చేపట్టారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. కారేపల్లి ఎస్సై బైరు గోపీ ఆధ్వర్యంలో పోలీసులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు ను అదుపులోకి తీసుకోని పోలీసు వాహనంలో స్టేషన్ కు తరలిస్తుండగా కార్మికులు వాహనానికి అడ్డుపడ్డారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. వ్యకాస నేతను స్టేషన్ కు తరలించిన అనంతర మిగితానాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. పోలీస్ స్టేషన్ సైతం కార్మిక సంఘంనేతలునిరసన కార్యక్రమాన్ని సాగించారు. ఈసందర్భంగా వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర లు మాట్లాడతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పేదలు, కార్మికులు, రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పేదలకు పని కల్పించే ఉపాధి హామీ గ్యారెంటీ చట్టాన్ని కొనసాగించాలని ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించే రేషన్ షాపులను నిర్వీర్యం చేస్తుందన్నారు. నిరుపేదలకు 35 కేజీలబియ్యం అందజేసే ఏఏవై కార్డులకు బియ్యం కుదించిందన్నారు ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు.





కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లతో కార్మికుల శ్రమను దోచుకోవటానికి కార్పొరేట్ సంస్ధలకు హక్కు కల్పించారన్నారను. ఇక 12 గంటల పనివిధానం రానుందన్నారు పని భారం తగ్గించి కనీస వేతన చట్టం అమలు చేయాలని.వ్యవసాయ చట్టాలు, విద్యుత్ చట్టాలను తీసుకవస్తుందని దీంతో వ్యవసాయ రంగంలో చిన్న సన్నకారు రైతులపరిస్థితి ప్రశ్నార్ధకంగా మారనుందన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజల నిరసన జైల్ భరోతో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కేశగాని ఉపేందర్, యనమనగండ్ల రవి, పాసిని నాగేశ్వరరావు, ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు సురభాక ధనమ్మ, కొండబోయిన ఉమావతి, సీఐటీయు ముక్క సీతారాములు, అజ్మీర శోభన్, సోమందుల నాగమణి, ఎల్లబోయిన రాధ, గుర్రం వెంకటేశ్వర్లు, కేలోత్ రవి, శనగ రాంబాబు, ఆదెర్ల వినయ్, రేగళ్ల మంగయ్య, కరపటి సీతారాములు, కొండల్‌రావు, ఇస్మాయిల్, కళ్యాణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు భరోసా





**వర్ధన్నపేట, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అండగా నిలిచారు. సోమవారం హనుమకొండలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్తో కలిసి చిన్నారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని, అనంతరం పండ్లు పంపిణీ చేశారు.

తలసేమియా చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరమవుతుందని, వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇప్పటికే పలుమార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఈవీ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 12 వ వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి. -సింగరేణిలో మహా ధర్నా...



**సత్తుపల్లి, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** సింగరేణి సత్తుపల్లి పట్టణం సింగరేణి లో 12 వెజ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని జే.వి.ఆర్ ఓసి , కిష్టారం ఓసి , జే.వి.ఆర్ సి.హెచ్.పి సింగరేణి ఉద్యోగులందరూ ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ మరియు సింగరేణిలో ఉన్న జాతీయ సంఘాల పిలుపుమేరకు సింగరేణి వ్యాప్తంగా చేసే ధర్నా కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ఐ.ఎన్.టి.యు.సి , ఏఐటీయూసీ , హెచ్ఎంఎస్ , సిఐటియు , టీబీజీకేఎస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించి సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు సత్తుపల్లి జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారి ద్వారా వినతి పత్రం అందించారు.సత్తుపల్లి సింగరేణి ఐక్య కార్మిక సంఘాల జే.ఏ.సీ నాయకులు తీగల క్రాంతి కుమార్, కోటేశ్వరరావు , సముద్రాల సుధాకర్ , దార భీమయ్య , ఆంజనేయులు , అస్గర్ ఖాన్ , సంపత్ , గిద్దయ్య లు మాట్లాడుతూ కోల్ ఇండియా పరిధిలో ఉండే అన్ని బొగ్గు పరిశ్రమల్లో ఉద్యోగుల జీతభత్యాల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం 12వ వేజ్ బోర్డు ఏర్పాటుకు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.11 వేజ్ బోర్డ్ 2026 జూన్ నెల నాటికి ముగిసిందని , 11 వేజ్ బోర్డుపై ఆరు నెలల ముందే కమిటీని ఏర్పాటు చేసినటువంటి కేంద్ర ప్రభుత్వం 12 వ వేజ్ బోర్డ్ సమయం దాటినప్పటికీ ఎందుకు కమిటీని ఏర్పాటు చేయట్లేదని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 12 వ వేజ్ బోర్డుపై కమిటీని ఏర్పాటు చేయకుండా కలకత్తాలో జరిగిన సమావేశంలో కేవలం నాలుగు లేబర్ కోడ్ అమలుపై మాత్రమే ప్రస్తావన చేశారని పేర్కొన్నారు.సెప్టెంబర్ 12 వ తేదీన రాంచీ లో జరిగే సదస్సు లో వేజ్ బోర్డు విషయంపై స్పష్టత రాకుంటే కోల్ ఇండియా వ్యాప్తంగా కార్మిక వర్గం అంతా సమ్మె చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఐక్య కార్యముక సంఘాల నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు పాల్గొన్నారు.


## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ,

# లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాడాలి

### జనగామ, ఘనపూర్‌లో జైల్‌భరో కార్యక్రమంలో రాస్తారోకోలు.. పలువురు నాయకుల అరెస్టు










**జనగామ, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు.నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జనగామ, ఘనపూర్ టౌన్‌లో జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా భారీ ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించారు.జనగామ పట్టణంలోని నెహ్రూ పార్కు వద్ద నిర్వహించిన రాస్తారోకోకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ అధ్యక్షత వహించారు. కాసు మాధవి, మోకు కనకారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని వారు విమర్శించారు. ఈ కోడ్‌లు అమలైతే కార్మికుల పని గంటలు పెరగడంతో పాటు సామాజిక భద్రత, ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.కార్మికులు తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, సమ్మె హక్కుపై ఆంక్షలు, కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను కఠినతరం చేసే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల తొలగింపులకు అనుకూలంగా తీసుకువస్తున్న విధానాలను రద్దు చేయాలని కోరారు.వ్యవసాయ రంగంలోకి విదేశీ దిగుమతులను ప్రోత్సహించడం వల్ల దేశీయ రైతులకు నష్టం జరుగుతుందని నాయకులు ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు భీమా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తగిన నష్టపరిహారం, సాగుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.నూతన విద్యుత్ విధానాల వల్ల స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ ఛార్జీల పెరుగుదల వంటి భారాలు ప్రజలపై పడతాయని వారు విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకురావడం వల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సమైక్య పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.జనగామలో నిర్వహించిన రాస్తారోకో కారణంగా ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రాస్తారోకోలో పాల్గొన్న నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**ఘనపూర్ టౌన్‌లో భారీ ప్రదర్శన..**

అదే రోజు ఘనపూర్ టౌన్‌లో జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా సీపీఎం కార్యాలయం నుంచి గాంధీ చౌరస్తా వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.అనంతరం గాంధీ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాగిన క్విట్ ఇండియా ఉద్యమం నేటికీ పోరాట స్ఫూర్తిని అందిస్తోందన్నారు. అదే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కార్మికుల హక్కులను బలహీనపరిచే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతకు విఘాతం కలిగించడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ వైపు నడిపించడం వంటి చర్యలు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని విమర్శించారు.రైతులకు గిట్టుబాటు ధర, పంటలకు భరోసా, సాగునీరు, పెట్టుబడి సాయం వంటి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.వ్యవసాయ కూలీలకు ఉపాధి అవకాశాలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే పాలన పరిమితమైతే ప్రజలు చూస్తూ ఊరుకోరని రాపర్తి రాజు హెచ్చరించారు.కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు ఐక్యంగా ఉద్యమించి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడతారని స్పష్టం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం నేర్పిన పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకునే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.జనగామ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పి. ఉపేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బోట్ల శేఖర్, సీఐటీయూ జిల్లా నాయకుడు జోగు ప్రకాష్, రైతు సంఘం జిల్లా నాయకులు రామవత్ మీట్య నాయక్, కుమార్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బూడిద ప్రశాంత్, ఆవాజ్ జిల్లా నాయకుడు ఎండీ అజారుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ, ఐద్వా పట్టణ కార్యదర్శి పందిళ్ల కల్యాణి తదితరులు పాల్గొన్నారు.ఘనపూర్ టౌన్ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఇర్రి అహల్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్, మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగెల రమేష్, ప్రజా సంఘాల నాయకులు తోడెంగల ఐలయ్య, ఎడ్ల రాజు, గట్ల మల్లారెడ్డి, మంద మహేందర్, చిలుముల్ల భాస్కర్, పోలాసు పరమేష్ తదితరులతో పాటు రైతులు, వ్యవసాయ కూలీలు, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెంకటయ్య దశదిన కర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



**వర్ధన్నపేట, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన నవతెలంగాణ రిపోర్టర్ బావండ్లపెల్లి కిరణ్ తండ్రి వెంకటయ్య దశదిన కర్మ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య చిత్రపటానికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆయన వెంట రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, 14వ డివిజన్ మాజీ అధ్యక్షుడు ముడుసు నరసింహ, కేతిరి రాజశేఖర్, గంద్రాతి భాస్కర్, పత్రి సుభాష్, నేరెళ్ల రాజు, జక్కు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెంకట సాయి నగర్ కాలనీలో బోనాల ఉత్సవాలు





**ఉప్పల్, 10 ఆగస్టు (కెరటం న్యూస్):** రామంతపూర్ బాగాయత్‌లోని వెంకట సాయి నగర్ కాలనీలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి తొట్టెల ఊరేగింపును కాలనీలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. తొట్టెల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, డప్పుల మోత, మహిళల బోనాల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. బోనాల పండుగను ప్రతి సంవత్సరం కాలనీ ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాలనీలో సుఖశాంతులు, ఆరోగ్యం, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి ,సభ్యులు రమేష్ గౌడ్, ఎం రవికుమార్ , గోపాల్ యాదవ్ , సర్వ సత్తయ్య యాదవ్, శివ శంకర్ , సంజీవ

కమిటీ సభ్యులు ఆర్ గోవింద్, జి అశోక్, శ్రీనివాస్ గౌడ్ , కే నవీన్ కుమార్, భూపతి నరసింహ గౌడ్, డాక్టర్ విద్యాసాగర్, రామకృష్ణ, శివకుమార్ , బి.చలపతిరావు, రమేష్ శెట్టి, శ్రీధర్ గౌడ్, స్వామి, నరేష్, శ్రీనివాస్ రెడ్డి ,హరీష్ , శేఖర్, బి.రాములు గౌడ్, చంద్రం చారి ,పరుశురాం, ఐలేష్ యాదవ్, చారి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు